మొక్కలు నాటి సంరక్షించాలి

కాచిగూడ: మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతనూ చూసుకోవాలని జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం కాచిగూడలోని అకాడమీలో విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేశారు. మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు స్వచ్ఛందంగా మొక్కలు నాటి సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు అమృతారెడ్డి, గణ సంతోషిణిరెడ్డి, అనఘ, వెంకట్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారులకు సంప్రదాయ నృత్యాలను నేర్పించాలి

చిక్కడపల్లి: సంప్రదాయ భారతీయ నృత్యాలను చిన్నారులకు నేర్పించాలని కథక్ నాట్య గురువు పండిట్ డాక్టర్ అంజిబాబు అన్నారు. నటేశ్ స్కూల్ ఆఫ్ భరత నాట్యం సాండిగో విద్యార్థిని కీర్తి టాడిమేటి అశోక్‌నగర్‌లోని సత్యనారాయణ స్వామి దేవాలయంలో భరతనాట్య ప్రదర్శన బుధవారం ఇచ్చారు. ఈ సందర్భంగా నృత్య కళాకారిణిని ఆయన సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అశోక్‌నగర్ వెల్ఫేర్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీసీ యువతకు ఐఏఎస్, ఐపీఎస్ అకాడమీ ఏర్పాటు చేయాలి

కాచిగూడ: తెలంగాణలో బీసీ యువతీ, యువకుల కోసం ప్రత్యేక ఐఏఎస్, ఐపీఎస్ అకాడమీని ఏర్పాటు చేయాలని తెలంగాణ బీసీ యువ చైతన్య పోరాట సమితి నేత కోహెల్కర్ సాయికాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అకాడమీలో వసతి, భోజనం, లైబ్రరీ, స్టడీ హాల్, అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లతో కూడిన అకాడమీని ఏర్పాటు చేయాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఉత్తర ప్రాంత రాష్ట్రాలలో ధనికులకు అన్ని సదుపాయాలతో కూడిన అకాడమీలు ఉండటం వలన అధికంగా ఐఏఎస్, ఐపీఎస్ ర్యాంకులు సాధిస్తున్నారని అన్నారు. తెలంగాణలో కూడా ఏర్పాటు చేస్తే యువత ర్యాంకులు సాధిస్తారని ఆయన పేర్కొన్నారు.

లగచర్ల బాధితులకు న్యాయం జరగాలి

ఉస్మానియా యూనివర్సిటీ: లగచర్ల గిరిజన రైతులకు బేడీలు వేయడం దారుణమని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఓయూ క్యాంపస్ లా కాలేజీలోని డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి లగచర్ల రైతులకు న్యాయం జరగాలని వినతి పత్రం అందచేశారు. రైతుల భూమి లాక్కోవడం, కేసులు పెట్టి బేడీలు వేసి అరెస్టులు చేయడం, జైల్‌లో నిర్బంధించి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణమన్నారు. కార్యక్రమంలో కిషోర్‌గౌడ్, గదరాజు చందు, జంగయ్య, రాజేస్‌నాయక్, శివకుమార్, నాగరాజు, మిథున్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద అంత్యక్రియలకు ఆర్థికసాయం

పంజగుట్ట: నిరుపేద అంత్యక్రియలు నిర్వహించేందుకు ఓ దాత, స్థానిక బస్తీవాసులు ముందుకు వచ్చారు. ప్రేమ్‌నగర్‌కు చెందిన లక్ష్మణ్ అనే యువకుడు పెయింటింగ్ పనులు చేసుకుంటూ భార్య, చెల్లి, తల్లితో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. నెల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అయితే అంత్యక్రియలు చేసేందుకు వారి వద్ద డబ్బులు లేక దీనస్థితిలో రోధిస్తుండగా రవీందర్ అనే స్థానికుడు ఆర్థికసాయం అందించాడు. అంతేగాకుండా స్థానిక బస్తీ కమిటీ వాసులు కలిసి బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12, 13 హిందూ శ్మశానవాటికలో ఉచితంగా అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక బస్తీ కమిటీ నాయకులు కే భగవాన్ దాస్, సుధీర్‌కుమార్ సాయం చేసిన రవీందర్‌తో పాటు ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: పోలీసుల గురించి పుస్తకాన్ని రాయడం అభినందనీయమని అడిషనల్ డీసీపీ రాందాస్ తేజావత్ అన్నారు. బుధవారం ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌లో రామదాసు సాహితీ కళా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దూత రామకోటేశ్వర్‌రావు సంపాదకీయంలో రూపొందించిన నాలుగో సింహం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పోలీసుల సాదక బాదకాలు, శాంతిభద్రత విషయంలో కష్టపడుతున్న తీరు వంటి ఎన్నో అంశాలపై పుస్తకం తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు భీమ శ్రీనివాసరావు, జేవీ.కుమార్, రవీంద్రబాబు, గజవెల్లి సత్యనారాయణ, కావ్య, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

హయత్‌నగర్: జంతు శాస్త్రం బోధించడానికి అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ పాసైన వారు ఇందుకు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 21లోగా ధ్రువపత్రాలతో కళాశాలలో సంప్రదించాలని ఆయన సూచించారు.

సేవలు అంతంతే..!

మండల కార్యాలయాల సిబ్బంది సేవలు మరోచోట

ఉద్యోగులు లేక వెలవెలబోతున్న కౌంటర్లు



- ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వేకు బదలాయింపు
- పౌర సేవలకు విఘాతం, ఇబ్బందుల్లో ప్రజలు
- మరోవైపు ప్రొటోకాల్ బిజీలో తహసీల్దార్లు

బంజారాహిల్స్: తహసీల్దార్ కార్యాయాల్లో పౌర సేవలకు విఘాతం కలుగుతోంది. సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో నిత్యం ఎన్నో పనుల కోసం ఆఫీసులకు వస్తున్న ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వ పథకాల సర్వేకు షేక్‌పేట, ఖైరతాబాద్ మండలాల నుంచే సిబ్బందిని కొద్దిరోజులుగా పంపిస్తుండడంతో ఈ రెండు మండలాల పరిధిలో సేవలు నిలిచిపోతున్నాయి. షేక్‌పేట మండల పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట, ఖైరతాబాద్ మండల పరిధిలోని సోమాజీగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్ డివిజన్ల పరిధిలో ప్రజలు కార్యాలయాలకు వస్తుండగా సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. తాజాగా ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వేకు ఈ రెండు మండలాల నుంచే సిబ్బందిని పెద్ద ఎత్తున పంపించారు. దీంతో ఉద్యోగులు లేక కౌంటర్లు వెలవెలబోతున్నాయి. దీనికి తోడు తహసీల్దార్లు సైతం ప్రొటోకాల్ బిజీలో ఉంటుండడంతో వారిని కలిసేందుకు వచ్చేవారు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడ సర్వే జరిగినా ఇక్కడి నుంచే ఉద్యోగులను డిప్యూటేషన్‌పై పంపిస్తున్నారు. అంబర్‌పేటలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం ఖైరతాబాద్, షేక్‌పేట మండలాల పరిధి నుంచి ఐదుగురు చొప్పున డిప్యూటేషన్‌పై వెళ్లారు. అసలే అరకొర సిబ్బందితో ఇబ్బందులు పడుతున్న తహసీల్దార్ కార్యాలయాల్లో ఉన్న కొద్దిమంది ఉద్యోగులు కూడా వెళ్తుండడంతో సకాలంలో సేవలు అందక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు సర్వే ఇంకెన్నాళ్లు కొనసాగుతుందో తెలియని పరిస్థితి నెలకొనగా ప్రజా సమస్యలు కూడా తీవ్రతరమవుతున్నాయి.



బంజారాహిల్స్ రోడ్డు నంబర్-2లోని షేక్‌పేట తహసీల్ కార్యాలయం

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దేశప్రజలకు క్షమాపణ చెప్పాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దేశప్రజలకు క్షమాపణ చెప్పాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌ను ఎగతాలి చేసి అహంకారంగా మాట్లాడటాన్ని దేశ ప్రజలు, ప్రజాస్వామికవాదులు తీవ్రంగా ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 19న రాష్ట్ర వ్యాప్తంగా అమిత్‌షా దిష్టిబొమ్మలను దహనం చేయనున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ వద్ద నిరసన తెలపడం హర్షణీయమని అన్నారు.

19న అమిత్‌షా దిష్టిబొమ్మల దహనం

ఇలాంటి మతోన్మాద చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా మాటిమాటికి అంబేడ్కర్ పేరు ఎత్తడం వీళ్లకు పెద్ద ఫ్యాషన్ అయిపోయిందని ఎగతాలిగా మాట్లాడటం బాధాకరం అన్నారు. ఎన్నికల ముందు అంబేడ్కర్ పేరు జపం చేసి అధికారంలోకి వచ్చాక ఆయన పేరు ఎత్తకూడదని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈ ప్రభుత్వంలో రాజ్యాంగంపైన ప్రభుత్వ రంగం సంస్థలపైన దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

వీఎస్‌టీ-డబ్ల్యూయూ అధ్యక్ష పోటీకి వీఎస్సార్ నామినేషన్



సాయిబాబా దేవాలయంలో పూజలు నిర్వహించిన వి.శ్రీనివాస్‌రెడ్డి



నామినేషన్ దాఖలు చేసేందుకు ర్యాలీగా తరలివెళ్తున్న శ్రీనివాస్‌రెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నగరంలో ప్రతిష్ఠాత్మకమైన వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ (డబ్ల్యూయూ) అధ్యక్ష పోటీకి ప్రస్తుత అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి (వీఎస్సార్) నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు బాగ్‌లింగంపల్లిలోని సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వీఎస్‌టీలోని కట్టమైసమ్మ దేవాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ కూడా అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం వీఎస్‌టీ కార్యాలయానికి చేరుకొని సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.

◆ ఈ సందర్భంగా వి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను అధ్యక్షుడిగా మూడు పర్యాయాలు గెలుపొందానని అన్నారు. అయితే కార్మికుల సంక్షేమానికి తాను ఎంతో కృషి చేశానన్నారు. వర్కర్స్‌కు వేతనాలు పెంచడంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు వంటి పలు సమస్యలను పరిష్కరించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి అయిలి ప్రభాకర్, బాబి, రవియాదవ్, శంకర్, మధుసుదన్, సత్యనారాయణ, రాములు, లతీఫ్, రవిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో పడిపూజ

కాచిగూడ: అయ్యప్ప మాలధారులు నింబోలిఅడ్డలో బుధవారం అయ్యప్పస్వామి మహా పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి పడిపూజకు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. పడిపూజలో రాఘవన్ గురుస్వామి, కిషోర్, గులాబ్ శ్రీనివాస్, శ్రీపతి దయాకర్ రెడ్డి, టింకు, శ్రీకాంత్, లక్ష్మణ్, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

లిబర్టీ: తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అంశంపై నియమించిన ఏకసభ్య కమిషన్ జస్టిస్ డాక్టర్ షమీం అక్కను మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ వర్గీకరణ చెల్లదని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ వర్గీకరణ చేసేందుకు యత్నించడం తగదన్నారు. వర్గీకరణకు అనుకూలంగా నివేదిక ఇవ్వద్దని వినతిపత్రంలో ఆయన కోరారు.

సారథి కళాకారులను విమర్శిస్తే సహించేది లేదు

కాచిగూడ: తెలంగాణ మలిదశ ఉద్యమంలో తమ రచనలతో ఆటపాటలతో సాంస్కృతిక సైనికులైన కవులు, కళాకరులను 580 మందిని గుర్తించి ఆనాటి ప్రభుత్వం సాంస్కృతిక సారథిని ఏర్పాటు చేసిందని తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అభినయ శ్రీనివాస్, కార్యదర్శి యశ్‌పాల్ తెలిపారు. ఈ సంస్థ ప్రధాన ఉద్దేశం ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడమని పేర్కొన్నారు. ఇటీవల కొంత మంది స్వార్థపరులు, ప్రభుత్వ వ్యతిరేకులు సాంస్కృతిక సారథి కళాకారుల పట్ల ఎవరికి తొచినట్లు వాళ్ల అవాకులు, చవాకులు పేలుతున్నారని అన్నారు. ప్రభుత్వాన్ని ఎదుర్కోలేక కవులు, కళాకారులను ఇష్టం వచ్చిన రీతిలో మాట్లాడటం సరికాదన్నారు. సారథి కళాకారులను విమర్శిస్తే సహించేది లేదని వారు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడానికి తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. అది ఏ ప్రభుత్వమైనా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. రాజకీయాలతో తమకు సంబంధం లేదని పాటను నమ్ముకున్న వాళ్లం కాబట్టే ఈ గౌరవాన్ని పొందుతున్నామని పేర్కొన్నారు.

థియేటర్లలో సౌకర్యాలు నిల్: పీవైఎల్

ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో పలు థియేటర్ల సందర్శన



ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని థియేటర్ల సందర్శనకు వచ్చిన పీవైఎల్ నేతలు కేఎస్ ప్రదీప్, రవికుమార్, కృష్ణ, కిరణ్

చిక్కడపల్లి: థియేటర్లలో కనీస సౌకర్యాలు లేవని, సినిమా చూడాలంటే ప్రేక్షకులు తీవ్ర ఇబ్బందులు, ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని, దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని పీవైఎల్ రాష్ట్ర ప్రోగ్రెసివ్ యూత్ లీగ్(పీవైఎల్) పేర్కొంది. బుధవారం సుదర్శన్, దేవి, సంధ్య 70ఎంఎం, సంధ్య35 థియేటర్లను పీవైఎల్ ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్ మాట్లాడుతూ సుదర్శన్, దేవి థియేటర్లు ఒకే ప్రాంగణంలో ఉండటంతో పార్కింగ్ సమస్య ఎదురవుతోందన్నారు. వీటిల్లో తినుబండరాలను అధిక ధరలకు విక్రయిస్తున్నా తూనికలు, కొలతలు శాఖ అధికారులకు ఇవేవీ పట్టడంలేదన్నారు. ఈ నెల 4న పుష్ప-2 సినిమా ప్రీమియర్‌షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే ప్రేక్షకురాలు చనిపోయిందని, ఆమె కుమారుడు శ్రీ తేజ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకముందే ప్రభుత్వం మేల్కొనాలన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.రవికుమార్, ప్రధాన కార్యదర్శి బీఎస్ కృష్ణ, నాయకులు కిరణ్, బంగారి శ్రీనివాస్, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా పూలే దంపతుల

విగ్రహాలను ఏర్పాటు చేస్తాం



సావిత్రి బాయి పూలే జయంతి ఉత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట సావిత్రి బాయి పూలే జయంతి ఉత్సవాల పోస్టర్‌ను బీసీ నాయకులతో కలసి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. తెలంగాణ పేరుతో ఎలాంటి రూపం, చరిత్రలేని ఊహాజనితమైన తల్లుల విగ్రహాలు బీసీలకు అవసరం లేదన్నారు. జనవరి 3న ఉదయం 11 గంటలకు జరిగే సావిత్రి బాయి పూలే 194వ రాష్ట్ర స్థాయి జయంతి ఉత్సవాలలో పార్టీలకు అతీతంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దేశంలో మహిళలకు విద్యను నేర్పిన గొప్ప వ్యక్తి సావిత్రి బాయి పూలే పేరును స్కిల్ యూనివర్సిటీకి పెట్టాలని, చారిత్రక కట్టడాలకు, జాతీయ రహదారులకు, ప్రాజెక్టులకు, విమానశ్రయాలకు పూలే దంపతుల పేర్లు పెట్టాలని, కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డులను ప్రదానం చేసి గౌరవించాలని జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. కార్యక్రమంలో బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ బి.మని మంజరి, బీసీ నేత జాజుల లింగంగౌడ్, మహిళా నేతలు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నేడు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి జి.జయశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా విద్యార్హత కలిగి ఉండి 18 నుంచి 30 ఏళ్ల లోపు నిరుద్యోగులు అర్హులన్నారు. నగరంలోని ప్రముఖ ప్రైవేటు సంస్థల్లోని ఉద్యోగాల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా మేజిక్ బస్సు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇక్కడ రెండు నెలల పాటు ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ కోర్సులలో శిక్షణను ఇచ్చి ఉద్యోగ ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు గురువారం ఉదయం 10.30 గంటలకు ధ్రువీకరణ పత్రాలు, ఫొటోలతో విజయనగర్‌కాలనీలోని రంగారెడ్డి జిల్లా ఉపాధికల్పనా కార్యాలయంలో నేరుగా హాజరుకావాలన్నారు. వివరాలకు 90630 99306లో సంప్రదించవచ్చు.

ఏజెన్సీ ప్రాంత ఎస్సీలకు రిజర్వేషన్లు కొనసాగించాలి



మాట్లాడుతున్న షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ అధ్యక్షుడు శ్రీనివాస్

కాచిగూడ: ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఏజెన్సీ ప్రాంత ఎస్సీ రిజర్వేషన్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం తొలగించడంతో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని, మళ్లీ కొనసాగించాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ కోరారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో వెనుకబడి ఏజెన్సీ ప్రాంతంలో నివాసముంటున్న ఎస్సీ కులాలలను గుర్తించి నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తమ జనాభా 10 లక్షలకు పైగా ఉందని రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మరింత జనాభా పెరిగిందని ప్రభుత్వం 20 శాతం రిజర్వేషన్లు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కే ధన్‌రాజ్, ఏ.కృపాకర్, కండె రాములు, ఆనుముల వెంకటేశ్వర్లు, సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మజ్దూర్ యూనియన్ విజయోత్సవ ర్యాలీ

అడ్డగుట్ట: రైల్వే ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో అత్యధిక ఓట్లతో విజయం సాధించిన మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నేడు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయం నుంచి రైల్ నిలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నారని తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా, కోశాధికారి, మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకర్‌రావులు పాల్గొంటున్నారని చెప్పారు.

నిషేధిత గుట్కా విక్రయిస్తున్న ఒకరి అరెస్టు

పంజగుట్ట: నిషేధిత గుట్కా, పాన్‌మసాలా, సిగిరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని పంజగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం .. మంగళవారం సాయంత్రం పంజగుట్ట పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల వద్ద ఓ టీ కొట్టు వద్ద ఒకరు గుట్కా నమలడం చూశారు. వెళ్లి అక్కడ తనిఖీలు చేయగా మొత్తం 20 బాక్సుల నిషేధిత గుట్కా, పాన్‌మసాలా, సిగిరెట్లు లభ్యంకాగా స్వాధీనం చేసుకున్నారు. టీ స్టాల్ నిర్వాహకుడు బాలాపూర బస్తీకి చెందిన శ్రీనును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలమూరు యూనివర్సిటీకి కె.లింగమూర్తి పేరు పెట్టాలి

గన్‌ఫౌండ్రీ: పాలమూరు యూనివర్సిటీకి కపిలవాయి లింగమూర్తి పేరు పెట్టాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం ప్రభుత్వాన్ని కోరింది. బుధవారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్ మోహన్ మాట్లాడారు. తెలంగాణ సాహిత్యానికి పునర్జీవం తీసుకొచ్చేందుకు కృషి చేసిన వ్యక్తి కపిలవాయి లింగమూర్తి అన్నారు. పాలమూరు బిడ్డ కపిలవాయి పేరును విశ్వవిద్యాలయానికి నామకరణం చేయడం వల్ల సాహితీవేత్తలందరిని గౌరవించినట్లవుతుందని తెలిపారు. సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, కోశాధికారి రవీంద్రచారి పాల్గొన్నారు.

22న సారంగి అవార్డుల ప్రదానం

గన్‌ఫౌండ్రీ: ఔత్సాహిక యువ నటీనటుల ప్రతిభను గుర్తించి అవార్డులను ఇవ్వడం అభినందనీయమని ప్రముఖ సినీ దర్శకుడు రాఘవేందర్‌రావు అన్నారు. 22న రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న సారింగి ఫిల్మ్ అవార్డ్స్ వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ..కళాకారులకు అవార్డులు ఎంతో బలాన్ని చేకూరుస్తాయన్నారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, ఛలనచిత్ర అభివృద్ధి మండల చైర్మన్ దిల్‌రాజుతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని సంస్థ అధ్యక్షుడు ఖాజ అఫ్రిది తెలిపారు.

పెన్షన్ మంజూరులో జాప్యాన్ని నివారించాలి

అడ్డగుట్ట: రైల్వేలో సెకండరీ పెన్షన్ మంజూరు చేయటంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు చర్యలు చేపట్టాలని ఎన్ఎఫ్ఐఆర్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య అధికారులను కోరారు. బుధవారం సికింద్రాబాద్‌లోని ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయంలో మర్రి రాఘవయ్యను సీ. రామ్మోహన్ అనే వ్యక్తి మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. శేషగిరిరావు అనే వ్యక్తి విజయనగరంలో పార్సిల్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసి 1996లో మరణించాడు, భార్య 2014లో మరణించారు. వారికి చదువుకోలేని అవివాహిత కుమార్తె ఉంది. ఆమెకు ఫ్యామిలీ సెకండరీ పెన్షన్ కోసం పదేళ్ల క్రితం దరఖాస్తు చేసుకోగా, మంజూరుకై తీవ్ర జాప్యం జరిగింది. మర్రి రాఘవయ్యను కలిసి విన్నవించారు. తక్షణమే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పెన్షన్ మంజూరికి చర్యలు చేపట్టారు. దీంతో పదేళ్ల సమస్యకు పరిష్కారం లభించడంలో దరఖాస్తుదారు కుటుంబసభ్యుడు రామ్మోహన్ మర్రి రాఘవయ్యను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారులు కుమారస్వామి, కృష్ణలత తదితరులు

కాచిగూడ: తెలంగాణ సాధనకు తొలి, మలిదశ ఉద్యమాల్లో పాల్గొన్న ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక చైర్మన్ గోధుమల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి కృష్ణలత కోరారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి స్వాతంత్ర్య సమరయోధుల మాదిరిగా ఉద్యమకారులకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. అంతేగాకుండా ఉద్యమకారుల కుటుంబాలకు ఉచితంగా కార్పొరేట్ విద్య, బస్ సౌకర్యం కల్పించాలని, హెల్త్‌కార్డు ఇవ్వాలని, అలాగే ఉద్యమకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అంజిరెడ్డి, గొల్లపల్లి నాగరాజు, బీరకాయల మధుసూదన్, సంగారపు రవీందర్, ఎండీ రహామన్ అలీ, రఘునందన్ రెడ్డి, సూరె సాయిగౌడ్, యాకయ్య, రమేశ్, రుద్రోజు నవీన్ కుమార్, కరుణాకర్, కొండా మహేశ్, తోట ఉపేందర్, సంపత్ కుమార్, ఎస్.ప్రభాకర్ పాల్గొన్నారు.